వడ్డీ లేకుండా పన్నులు చెల్లింపు

- అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం జీవో విడుదల
- 31లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ
- నగరంలో 1,92,666 అసెస్‌మెంట్లు
- ప్రస్తుతం రూ.146 కోట్లకు గాను రూ.91 కోట్లు వసూలు
- 31 వరకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేయనున్న క్యాష్ కౌంటర్లు


నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): నగరాభివృద్ధికి పన్నులే కీలకం. నగర వాసులు సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా నగరాభివృద్ధికి దోహదపడుతుంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి, గతంలో ఉన్న ఆస్తి పన్ను పాత బకాయిలు ఏక మొత్తంలో చెల్లించిన వారి పన్నులపై వడ్డీ మాఫీ చేసేందుకు ప్రభుత్వం మార్చి 31వ తేదీ వరకు గడువు విధించింది. దీంతో రెవెన్యూ అధికారులు ప్రత్యేక కార్యచరణతో ప్రజలకు తగిన అవగాహన కల్పిస్తూ పన్నులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే పన్నులు చెల్లించాల్సిన ఫోన్లకు మెసేజీల రూపంలో, ప్రత్యేక స్లిప్‌లు, ఆటోల ద్వారా ప్రచారం, లోకల్ చానల్స్‌లో స్క్రోలింగ్, పన్ను బకాయిదారులకు నేరుగా ఫోన్ ద్వారా బకాయిదారులకు అధికారులు సమాచారం అందిస్తున్నారు.

31లోగా ఏకమొత్తంగా చెల్లిస్తే పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

కోవిడ్ కారణంగా పన్నులు కట్టలేక ప్రజలు ఇబ్బందులు పడిన దృష్ట్యా గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత సంవత్సరానికి, గతంలో ఉన్న పాత పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తూ గురువారం జీఓ జారీ చేసింది. దీని వలన పన్ను దారులకు ఊరట లభించనుంది. పన్ను బకాయిలు ఉన్న వారు ఏక మొత్తంలో ఈ నెల 31వ తేదీలోపు పన్నులు చెల్లించినట్లయితే పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ అవుతుంది.

నగరంలో 1,92,666 అసెస్‌మెంట్లు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 1,92,666 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి రూ.146.29 కోట్లు డిమాండ్ కాగా మార్చి 18తేదీ వరకు రూ.91.08 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.55.20 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా దీనిలో దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న బకాయిలు (ఉదాహరణకు రోడ్డు వైడింగ్‌లో ఇళ్లు కోల్పోయిన వారు, వివిధ కారణాల చేత ఇళ్లల్లో ఉండని వారు) రూ.20 కోట్లకు పైగా ఉంది. మార్చి 31వ తేదీలోపు మిగిలిన మొత్తాన్ని వసూలు చేసేందుకు రెవెన్యూ అధికారులు తగిన కృషి చేస్తున్నారు. పన్నుల వసూళ్లపై నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రతి రోజు రెవెన్యూ అధికారులతో, ఆర్‌ఐలతో సమీక్షాలు నిర్వహించి పన్నులు వసూళ్లను వేగవంతం చేస్తున్నారు. పన్నుల వసూళ్లలో వలంటీర్లు, సెక్రటరీలను భాగస్వామ్యం చేస్తూ నిరంతరం పన్ను వసూళ్లపై దృష్టి సారిస్తుంది అధికార యంత్రాంగం.

సెలవు రోజుల్లోనూ పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

ప్రజలు పన్నులు చెల్లించేందుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్‌గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయంతో పాటు అదనంగా భారత్‌పేట 140వ వార్డు సచివాలయం, వసంతరాయపురం 148వ వార్డు సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్డులోని 106వ వార్డు సచివాలయంలో కూడా పన్నులు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు. సెలవు రోజుల్లో కూడా పన్నులు చెల్లించేందుకు అధికారులు వెసులుబాటు కల్పించారు.

బకాయిదారులకు సువర్ణావకాశం



పన్ను బకాయిలపై వడ్డీ లేకుండా పన్నులు చెల్లించేందుకు ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. దీర్ఘకాలంగా ఆస్తి పన్నులో పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నవారికి ఇదొక సువర్ణ అవకాశం. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో కేటాయించిన ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు క్యాష్ కౌంటర్లు పనిచేసున్న నేపథ్యంలో పన్ను బకాయిదారులు తమ ఆస్తిసీటి, ఖాళీ స్థల పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి దోహదపడాలి.

– కీర్తి చేకూరి, కమిషనర్

క్లుప్తంగా

మహిళా కళాశాల అధ్యాపకురాలికి పీహెచ్‌డీ


బి. సుచరిత

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల కెమిస్ట్రీ పీజీ విభాగంలో అతిథి అధ్యాపకురాలుగా పని చేస్తున్న బి. సుచరితకు ఏఎన్‌యూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. ఆమె 'డెవలప్‌మెంట్ అండ్ వ్యాలిడేషన్ ఆఫ్ న్యూ అనలెటికల్ మెథడ్స్ ఫర్ ఎస్టిమేషన్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ ఇన్ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ బై యూజింగ్ ఆర్‌పీ–హెచ్‌పీఎల్‌సీ టెక్నిక్' అనే అంశంపై ప్రొఫెసర్ వి. అనురాధ మార్గదర్శకంలో డాక్టర్ పి. కిరణ్మయి సహకారంతో పరిశోధన చేశారు. ఈసందర్భంగా డాక్టర్ బి. సుచరితకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, సహచర అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

నేడు ఉచిత వక్త శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్ (స్టెప్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు పర్యవేక్షణలో కొరిటెపాడులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఆదివారం ఉచిత వక్త శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్టెప్ జిల్లా అధ్యక్షుడు అలా అనంతరామయ్య, ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ నర్రా రాజశేఖర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేగంగా సాంకేతిపరంగా మారుతున్న ఈ సమాజంలో గొప్ప పబ్లిక్ స్పీకర్‌గా తయారై సమాజానికి ఎలా ఉపయోగపడాలి.. అనే అంశాన్ని తీసుకొని ఉచితంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ఉత్తమ వక్తలుగా తయారవ్వాలని ఆకాంక్షించారు. వివరాలకు 9703566770 నంబరును సంప్రదించాలని వారు తెలియజేశారు.

వసతి గృహం తనిఖీ



నెహ్రూనగర్ మహిళా ప్రాంగణంలో ఉన్న గిరిజన విద్యార్థినుల వసతి గృహాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ మెంబర్ బి.పద్మావతి శనివారం తనిఖీ చేశారు. వసతి గృహంలోని మరుగుదొడ్లు, రూములు, పరిసరాలను, భోజన షెడ్యూల్డ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను గుర్తించిన ఆమె సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు, ఐసీడీఎస్ పీడీ మనోరంజనీ, సీడబ్ల్యూసీ మెంబర్ రాజకుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐఏఎల్‌కు నూతన సారథులు



గుంటూరు లీగల్ : భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) గుంటూరు జిల్లా మహాసభ శనివారం స్థానిక అరండల్‌పేటలోని ఓ కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శంకర్, నాలుగో అదనపు జిల్లా జడ్జి రాంగోపాల్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, ముప్పాళ్ళ సుబ్బారావు, ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది నరసింహారావు సభకు హాజరై ప్రసంగించారు. జస్టిస్ శంకర్ కొలీజియం వ్యవస్థపై, జిల్లా జడ్జి రాంగోపాల్ సమాజంలో మనుషుల నైతిక పరిస్థితులపై వివరించారు. అనంతరం గుంటూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ జిల్లా అధ్యక్షుడుగా చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా దాసరి ఉమామహేశ్వర రావు, ఉపాధ్యక్షులుగా ఎస్.రామారావు, వెలుగురి రాధాకృష్ణమూర్తి, కార్యదర్శులుగా పరుచూరి కుమారి నంద, ఆర్ వెంకటేశ్వరరావు, ఎస్.వేణుగోపాల్, నాగాంజనేయులు తదితరులు ఎన్నికయ్యారు. ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శిగా సీనియర్ న్యాయవాది నరసింహారావు కొనసాగుతారని తెలియజేశారు.

వేంకటేశ్వరునికి న్యాయమూర్తి పూజలు



పాతగుంటూరు: లాలాపేటలోని శ్రీ పద్మావతి అండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్. వి.గోపాలకృష్ణారావు సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో న్యాయమూర్తికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాసరావు, చైర్మన్ పి. జయ ప్రకాష్ రెడ్డి, ధరకర్తల మండలి సభ్యులు, అర్చకులు మురళి చంద్రకుమార్, ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్యను బోధించాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పోటీ ప్రపంచంలో విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారని, వారికి ఒత్తిడి లేని విద్యను అందించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని హిడెన్ స్టార్స్ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ చిన్నారులకు ఒత్తిడి లేని విద్య అందాలని, ఆట, పాటలతో చదివే రోజులు మళ్లీ రావాలని ఆకాంక్షించారు. చిన్నారుల అభిరుచి, ఆకాంక్షలను తల్లిదండ్రులు గుర్తించాలని, వారు ఎంచుకున్న మార్గం దిశగా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు జ్యోతి, పాఠశాల డైరెక్టర్ శ్యామల సుబ్రహ్మణ్యం, అకడమిక్ ఫెసిలిటేటర్ హేమలత సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ జ్ఞాన దివ్యకు ఆర్థికసాయం


జ్ఞాన దివ్యను సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న తులసీ ధర్మచరణ్, వెంకటేశ్వరరావు

కొరిటెపాడు (గుంటూరు): తెనాలి మండలం, కఠేవరం గ్రామంకు చెందిన పవర్ లిఫ్టర్ నాగం జ్ఞాన దివ్యను వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. 2022 సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్‌లో టర్కీ దేశంలో జరిగిన ప్రపంచ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున కాంస్య పతకం, నవంబర్, డిసెంబర్‌లో న్యూజిలాండ్‌లో జరిగిన కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మూడు బంగారు, ఒక్క వెండి పతకాలను సాధించిన సందర్భంగా తులసి ధర్మచర్ జ్ఞాన దివ్యకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని వేద సీడ్స్ కార్యాలయంలో శనివారం జ్ఞాన దివ్యను సత్కరించి రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాకు చెందిన ఆడబిడ్డ నేడు ఈ ఘనత సాధించడం ఎంతో గర్వంగా ఉందని, ఇలాంటి వారిని ప్రోత్సహించడం మన బాధ్యత అని తెలిపారు. ఈ ఏడాది మే నెల 1 నుంచి 6వ తేదీ వరకు జరిగే ఆసియా ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 84 కిలోల సబ్ జూనియర్ విభాగంలో పాల్గొననున్న జ్ఞాన దివ్యకు అవసరాల నిమిత్తం రూ.30 వేలు ప్రకటించడం జరిగిందన్నారు. జిల్లా, రాష్ట్ర, దక్షిణ భారత, జాతీయ, ప్రపంచ స్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లలో మంచి ప్రదర్శనను కనబరిచిన జ్ఞాన దివ్య భవిష్యత్‌లో మరింత పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జ్ఞాన దివ్య తండ్రి నాగం వెంకటేశ్వరరావు, నాగం పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

జేకేసీలో ఆధునిక ఫుడ్‌కోర్టు


కౌంటర్ హాల్‌ను ప్రారంభిస్తున్న భాష్యం రామకృష్ణ, పక్కన చుక్కపల్లి రమేష్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆదునిక ఫుడ్‌కోర్టును శనివారం కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ బిల్డర్ పులివర్తి శేషగిరి రావు ప్రారంభించారు. ఫుడ్‌కోర్టులో ఆధునిక కిచెన్‌ను నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కౌంటర్ హాల్‌ను కళాశాల పూర్వ విద్యార్థి, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ ప్రారంభించారు. పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ జేకేసీ కళాశాలలో చదువుకుని దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.40 లక్షల వ్యయంతో విద్యార్థుల ప్రయోజనం కోసం ఆధునిక క్యాంటిన్‌ను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీ మోహన్, పూర్వ విద్యార్థుల సంఘ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మాదాల వాసు, అధ్యక్షుడు కోటిరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, జేసీ లా కళాశాల కార్యదర్శి జె.కుప్పుస్వామి, పూర్వ విద్యార్థులు డాక్టర్ పి. కిరణ్, డాక్టర్ మమత, లావు పాపారావు, ఆడిటర్లు సీహెచ్ హరికృష్ణ, జీఎల్ఎస్ ప్రసాద్, మురళి, వేణు, విజయ్, సుభాష్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించండి

గుంటూరు ఎడ్యుకేషన్: రింగ్‌రోడ్డులోని సాయి ఆదిత్య స్కూల్ 30వ వార్షికోత్సవ వేడుకలను శనివారం కొరిటెపాడులోని కొమ్మినేని గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యా విధానంతో విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. క్రమశిక్షణతో కూడిన బాధ్యతాయుత ప్రవర్తన అలవర్చడం ద్వారా విద్యార్థుల్లో సమగ్ర వికాసాన్ని పెంపొందించగలమని అన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులందరు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావడంతో పాటు దేశం కోసం శ్రమించాలని సూచించారు. సివిల్స్ ర్యాంకర్ అశ్విన్ మణిదీప్ మాట్లాడుతూ పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది లేదని, విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మోదేపల్లి రవీంద్రబాబు, సూరె రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ సుజాత, ఏజీఎం రామకృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్‌లు సుబ్బారాయుడు, కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డాక్టర్ సుమితా శంకర్‌కు అరుదైన గౌరవం

- హార్వార్డ్ మెడికల్ స్కూల్ నుంచి సర్జికల్ లీడర్‌షిప్‌లో పట్టా
- భారతదేశం నుంచి ముగ్గురు మాత్రమే ఎంపిక
- గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీగా సేవలు


డాక్టర్ సుమితా శంకర్


ప్రశంసా పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ సుమితా శంకర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుమితా శంకర్‌కు అరుదైన గౌరవం లభించింది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అమెరికాలోని బోస్టన్ హార్వార్డ్ మెడికల్ స్కూల్ నుంచి సర్జికల్ లీడర్‌షిప్‌లో పట్టా పొందారు. ఈవిషయాన్ని శనివారం ఆమె మీడియాకు తెలిపారు. డాక్టర్ సుమితా శంకర్ 2022 మార్చిలో సర్జికల్ లీడర్‌షిప్ కోర్సులో చేరారు. భారత దేశం నుంచి ఈ కోర్సుకు కేవలం ముగ్గురు మాత్రమే ఎంపిక కాగా, వారిలో ఒకరు డాక్టర్ సుమితా శంకర్. ఏపీలో నాణ్యమైన సంరక్షణ, రోగుల భద్రత, ఆరోగ్య సంరక్షణ నిర్వహణలో పరిశోధన, ఆవిష్కరణలు తీసుకు రావడానికి సర్జికల్ స్పెషాలిటీలో నిపుణులకు సర్జికల్ లీడర్‌షిప్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఆఫ్రికా, అమెరికా, ఆసియా, యూరప్ ఇలా ప్రపంచ వ్యాప్తంగా 123 మంది వైద్యులను ఎంపిక చేయగా, వారిలో డాక్టర్ సుమితా శంకర్ ఒకరు. డాక్టర్ సుమితా శంకర్ భర్త డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ అడిషనల్ డీజీపీగా ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్నారు.

పురస్కారాన్ని గెలుచుకున్న డాక్టర్ సుమితా శంకర్

డాక్టర్ సుమితా శంకర్ గాయం సంరక్షణపై చేసిన ప్రాజెక్టుకు హార్వార్డ్ మెడికల్ స్కూల్ ఫ్యాకల్టీ ప్రత్యేక ప్రశంసా పురస్కారాన్ని డాక్టర్ సుమితా శంకర్‌కు అందజేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గుంటూరు జీజీహెచ్‌లో నిరుపేద రోగులకు అత్యంత క్లిష్టమైన ప్లాస్టిక్ సర్జరీ సేవలు అధిక సంఖ్యలో చేసి జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి మూడు పీజీ సీట్లు ఒకేసారి వచ్చేలా కృషి చేశారు. గుంటూరు జీజీహెచ్ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఫైలేరియా (బోదకాలుకు) శస్త్రచికిత్సలు చేసి ఆసుపత్రి కీర్తిని నలుదిశలా విస్తరింప చేశారు. బర్న్స్ స్కార్ మేనేజ్‌మెంట్, ఫ్యాట్‌గ్రాఫ్టింగ్, కోవిడ్ సమయంలో ఆమె చేసిన పరిశోధన, పోలీసు కుటుంబాలకు చేసిన కౌన్సెలింగ్‌లకు అందరి ప్రశంసలు అందుకున్నారు.

ప్రభుత్వ మద్దతుతో...

అమెరికాలోని ప్రతిష్టాత్మకమైన హార్వార్డ్ మెడికల్ స్కూల్‌కు రాష్ట్ర ప్రభుత్వం, జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల మద్దతుతో అనేక పరిశోధనలు చేసి వెళ్లగలిగినట్లు డాక్టర్ సుమితా శంకర్ తెలిపారు. అమెరికాలో నేర్చుకున్న నైపుణ్యాన్ని పూర్తి స్థాయిలో జీజీహెచ్‌లో అమలు చేసి నిరుపేదలకు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలు అందించడంలో తనవంతు కృషి చేస్తానన్నారు. కఠినమైన, సవాళ్లతో కూడిన కోర్సును నేర్చుకున్నానని, ఇలా విభాగాధిపతి హోదాలో సర్జికల్ లీడర్‌షిప్ కోర్సులో చేరడం తిరిగి చిన్న వయస్సులో పాఠశాలకు వెళ్లిన ప్రక్రియ లాంటిదని పేర్కొన్నారు. హార్వార్డ్ మెడికల్ స్కూల్‌లో మొదటి వర్కింగ్ ఉమెన్ గ్రాడ్యుయేట్‌గా నిలిచిన డాక్టర్ సుమితా శంకర్‌ను గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతిదేవి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతిలు అభినందించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గుంటూరు రూరల్: మండలంలోని దాసరిపాలెంలో ఓ పేద కుటుంబానికి రేపల్లె పట్టణానికి చెందిన ఏఎస్ఐ మస్తాన్‌రావు సహకారంతో వెస్లీ ఫౌండేషన్ ఫౌండర్ జాన్ వెస్లీ శనివారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఒక కుటుంబ పెద్ద పక్షవాతం వచ్చి మంచాన పడటంతో పోషణ ఇబ్బందిగా మారిందని తెలిపారు. విషయాన్నిఏఎస్ఐ మస్తాన్‌రావు దృష్టికి తీసుకెళ్ళగా ఆయన వెంటనే స్పందించి ఆ కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు, నూనె, కంది పప్పు, కూరగాయలను అందజేసినట్లు చెప్పారు. ఆపన్నులను ఆదుకునేందుకు వెస్లీ ఫౌండేషన్ ముందుంటుందని తెలిపారు.

విద్యార్థికి ప్రథమ చికిత్స

గుంటూరు రూరల్: పరీక్ష రాస్తూ స్పృహ కోల్పోయిన ఇంటర్ విద్యార్థికి కేంద్రంలోనే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రథమ చికిత్స అందించారు. పెదపలకలూరులోని విజ్ఞాన్ కళాశాలలో పరీక్ష రాసేందుకు శనివారం వచ్చిన ఓ ఇంటర్ విద్యార్థి హాలులోనే సొమ్మసిల్లిపోయాడు. వెంటనే స్పందించిన ఇన్విజిలేటర్, కళాశాల యాజమాన్యం విషయాన్ని సమీపంలోని మల్లవరం విలేజ్ క్లినిక్ వైద్యులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రెహనాఖాన్ సంఘటన స్థలికి చేరుకుని విద్యార్థిని పరీక్షించి, ప్రథమ చికిత్సను చేశారు. కొంతసేపటికి అతడు కోలుకుని మరలా పరీక్షను రాశాడు. ఈ సందర్భంగా వైద్య అధికారి ఝాన్సీబాయి మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ కడుపుతో పరీక్షలకు హాజరుకాకుండా ఏదైనా టిఫిన్ చేసి హాజరుకావాలని సూచించారు.

విద్యార్థి దశ సరైన మార్గంలో సాగాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ హేమచంద్రారెడ్డి


రూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఎంతో ముఖ్యమైన విద్యార్థి దశలో సరైన మార్గంలో పయనించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి అన్నారు. శనివారం జేకేసీ కళాశాల 55 వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో భావి జీవితానికి సరైన ప్రణాళికలు వేసుకున్న వారే ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. జీవితంపై అవగాహన కలిగి, విద్యను ఆయుధంగా మలచుకోవాలని సూచించారు. విలువలతో కూడిన మనిషి ప్రవర్తన, వ్యక్తిత్వంతో కూడిన విద్య సమాజానికి మూలమని, విద్యార్థుల భవితపై దేశ శ్రేయస్సు ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు చక్కని సమయ పాలన అలవర్చుకోవాలని, విద్య పునాదులు ఎంత దృఢంగా ఉంటే అంత బాగారాణిస్తారని అన్నారు. ఈసందర్భంగా శ్రీశ్రీ వంటి మహాకవుల కవితలను చదివి, విద్యార్థులను ఉత్సాహపర్చారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కళాశాల అధ్యక్షుడు ఆర్. సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహాత్మగాంధీనగర్ 2వలైనులో నివశించే పెద్దింటి జయప్రకాష్ శుక్రవారం ఇన్వెస్టిమెంట్ జాబ్ టెలిగ్రామ్ గ్రూపులో చేరాడు. గ్రూపులో చెప్పిన నంబరుకు డబ్బులు పంపితే అదనంగా డబ్బులు చెల్లిస్తారని మెసేజ్ వచ్చింది. జయప్రకాష్ మొదట రూ. వెయ్యి పంపగా, రూ. 1400లు తిరిగి అకౌంట్‌లో జమ అయ్యాయి. అనంతరం జయప్రకాష్ రూ. 3 వేలు పంపితే రూ. 3,800, రూ.15 వేలు పంపితే రూ. 30 వేలు అకౌంట్‌లో జమయ్యాయి. దీంతో అత్యాసకు పోయి జయప్రకాష్ రూ. 65 వేలు పంపారు. తిరిగి డబ్బులు రాలేదు. తాను మోసపోయినట్లు గుర్తించి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిల్లెళ్ళమూడి అమ్మవారి సేవలు చిరస్మరణీయం


అనుగ్రహభాషణం చేస్తున్న విశ్వయోగి విశ్వంజీ మహరాజ్

పాతగుంటూరు: బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై జిల్లెళ్ళమూడి శ్రీ విశ్వజననీ పరిషత్ ట్రస్ట్ నిర్వహణలో శనివారం అమ్మ శత జయంతి సందేశ సభ నిర్వహించారు. సభకు ట్రస్ట్ అధ్యక్షుడు కె. నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హిందూ కళాశాల అధ్యక్షులు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్, విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ డి.యస్.దీక్షిత్, ఆలయ అధ్యక్షులు సి.హెచ్. మస్తానయ్య, ట్రస్ట్ సభ్యులు పాల్గొని అమ్మవారి విశేషాలను వివరించారు. విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ అనుగ్రహభాషణం చేస్తూ జిల్లెళ్ళమూడి అమ్మవారి అనంతమైన సేవలు చిరస్మరణీయమన్నారు. క్రియా శక్తి, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి కలిసిన అమ్మ శక్తే జిల్లెళ్ళమూడి అమ్మ అన్నారు. కార్యక్రమాలను అమ్మ సందేశం ప్రచార కమిటీ కార్యదర్శి ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి నిర్వహించారు. చార్టర్డ్ అకౌంటెంట్ వడ్లమాని రవి సౌజన్యంతో నాట్యాచార్యులు ఖలీల్ బృందం నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో దర్శనపు శ్రీనివాస్, జిల్లెళ్ళమూడి సభ్యులు జె. సుబ్రమణ్యం, పి. హైమానంద, యు. విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలతో పాటు ప్రయోగాలపై పట్టు సాధించాలి



గుంటూరు రూరల్: సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ప్రయోగాలపై కూడా పట్టు సాధించాలని జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ కరీమున్నీసా సూచించారు. నగర శివారు బుడంపాడు గ్రామంలోని కళాశాలలో డిప్లొమా మెకానికల్ విభాగం విద్యార్థులకు గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ సదస్సు శనివారం ముగిసింది. ప్రముఖ డిజైనింగ్ సంస్థ టాలెంట్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 3డీ ప్రింటింగ్, ఆటోమొబైల్, ఏరో స్పేస్, రోబోటిక్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కరీమున్నీసా మాట్లాడుతూ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.